# మేనత్త - మేనల్లుడు

రోడ్డుమీద మోటారు తొక్కుతూ వుండగా వృత్తిధర్మం కళ్ళ ద్వారా కాళ్ళకి తెలిసి బ్రేకు పడింది.... 75 అడుగుల వెడల్పు గల రోడ్డు అది. అంతకి మించినవి మా మునిసిపాలిటీలో ఒకటి రెండు కన్న లేవు. గర్వంగా '75 ఫీట్ రోడ్' అని పేరెట్టుకుని ఆ రోడ్డు మీదుగా టు-వే-ట్రాఫిక్ అంగీకరించాం.

ఆ రోడ్డుమీద బిల్డింగుల ప్లానన్నీ రోడ్డు హద్దుకు పది అడుగుల మార్జిన్ వదిలితేనే ఆమోదిస్తాం. సందులు ఎలాగో పోనీ; రాజమార్గం కాపాడుకోవద్దా ?

అక్కడ రోడు అంచువరకు కట్టిన బిల్డింగు కనపడింది. "ఎవరండీ లోపల ?" అని తలుపు తోసి అడిగాను.

"రా, రా! ఎన్నాళ్ళకి గుర్తొచ్చాను నీకు!.... నిన్ను చూడ గానే మీ నాన్నను చూసినట్టుందివాళ" అన్నది. అరవై ఏళ్ళు దాటినా ఏ వంకరా ఎరగని ఒకావిడ. నేను వెర్రిమొహం వేయకుండా ఉండ డానికి ప్రయత్నిస్తూ వుండగానే "గుర్తుపట్టలేదుట్రా ? నేనురా ? మీ కాసులత్తని !" అన్నది.

నాన్నగారు చెప్పేవారు ఆయన పినతల్లి కూతురు 'కాసులమ్మ' ఈ వూళ్లో వుందని....కాని ఆ ఎండలో బంధుప్రీతి కన్న ఉద్యోగ ధర్మం మిన్న అయింది నాకు. "ఈ యిల్లు మీదేనా ?" అన్నాను.

"అవున్రా! మీ మామయ్య పోగానే వొచ్చిన డబ్బంతా పెట్టి కట్టించాను. లోపలి యిల్లు అంతా ఎవరో అద్దెకి కావాలంటే నేనుండ డానికి ఈ వసారా దింపాను, కూర్చో."

బంధువు లిళ్ళలో అయితే మొహమాటపడుతూ కూర్చునే నేను అధికార దర్పంతో కూర్చున్నాను. 'మంచినీళ్లు కావాలా ?' అందావిడ. వద్దన్నాను. "ఈ వూళ్లోనే ఉద్యోగంటగా నీకు ? వద్దామంటే పెద్ద దాన్ని అయిపోయినాను. ఏం పని, నీకు ?"

"బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ని."

"ఇకనేం, బాగానే వుందన్నమాట సంపాదనా అదీను."

ఆ లెంపకాయ మింగి వూరుకుంటానా ? 'ఈ వసారాకి పర్మిషన్ తీసుకున్నావా ? ప్లానుంటే తెచ్చి చూపించు' అన్నాను. ఆవిడ నన్ను ఒరే అంటోంది. నేను ఏకవచన ప్రయోగం చెయ్యడంలో తప్పేముంది ? పైగా అధికారదండం చేతుల్లో వుంది.

"ప్లానా, నా వల్ల కాదా ! ఏదీలేదు, వాళ్లేమో ఇల్లంతా అద్దెకిచ్చి మన్నారు నా కొక్క గది కావాలన్నా విన్లేదు. ఈ జాగా వదిలి వెళ్ళ లేక యిలా వసారా దింపుకున్నాను."

రిపోర్టు పెట్టించి నేలమట్టం చేయించడానికి ఆర్డర్స్ తీసుకున్నాను. 'కాసులత్త' నెత్తీ నోరూ బాదుకుంది. బంధువురాల్ని అంది. వృద్ధురాల్ని అంది. విధవరాల్ని అంది. చెమటా రక్తం పోగుచేసి కట్టానంది ఆర్నెల్లు సాముచేసి మూలనున్న ముసిల్దాన్ని కొడతావుట్రా అంది.

లేబర్‌ని తీసికెళ్ళి వసారా నేలమట్టం చేయించాను. నగర సౌందర్య రక్షణకి 'నేను సైతం' అని పాడుకొన్నాను.

మూడు నెలలయింది. మునిసిపాలిటీ కార్పొరేషన్ కావడం, ఆ సందర్భంగా కొన్ని సభలు కార్యక్రమాలూ ఏర్పాటు చెయ్యడంతో నాకు ఉద్యోగేతర విధులు తగిలి డ్యూటీకి టైం మిగల్లేదు. చివరికో రోజు ఎక్కడికో వెళ్ళొస్తూ 75 అడుగుల రోడ్డు మీదుగా వచ్చాను.

పాపం కాసులత్త ఏం చేస్తుందో అనుకుంటూ అటు చూశాను.

ఆశ్చర్యం !........ అక్కడ దీటైన షాపింగ్ సెంటర్ వెలిసింది. రెండు భాగాలుగా డాబా కట్టారు. ఒకదాంట్లో ఫ్యాన్సీ దుకాణం, మరొకటి వైన్‌షాపు........ ఎప్పుడు కట్టింది, ఎప్పుడు అద్దెలకిచ్చే

సింది? చిన్న వసారాకి అన్ని ఏడుప్వ లేడ్చి ఇంత పెద్ద బిల్డింగా? అనుకుంటూ సందులోగుండా లోపలి కెళ్ళాను. 'భౌ' అని అరుపు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ లేని కత్తిపోటులా గోళ్ళు....

"జానీ, మైండ్యువరోన్ బిజినెస్!" అని ఆ బెల్‌బాటమ్స్ అమ్మాయి అరవకపోతే ఆ అల్సేషన్ నా కంఠం కరిచేసేదే.

"కాసులమ్మ గార్లేరా?" అన్నాను.

"వుయ్ డోణ్ణో ఎనీ కాసలమ్మా! వుయ్ బాట్ దిస్ హౌస్ ఫ్రమ్ ఏన్ ఓల్డు బిచ్" అని యంగ్ డాగ్‌ని దువ్వుకుంటూ లోపలికెళ్ళింది బెల్బాటమ్మ.

షాపులు అద్దెకు తీసుకున్న వారినుంచి వోనరు పేరు సేకరించి, రిపోర్టు పెట్టాను. కొట్టి పారెయ్యించడానికి ఆర్డర్‌కోసం నోట్ రాశాను.

''దొరగారు పిలుస్తున్నారు సార్!''.... వెళ్ళాను.

వార్డ్ నెంబర్ ఫైవ్‌లో నువ్వు ఎన్నాళ్ళనుంచి ఉన్నావు? రెండేళ్ళయిందా? అయితే కట్టేదాకా వూరుకుని ఇప్పుడు పెట్టావేం రిపోర్టు? అప్పుడంతా ఏమేడుస్తున్నావ్? సిటీ బ్యూటీకి అడ్డొచ్చిందా? ఇలాంటి రాతలు రాస్తే తోలు వలిచేస్తాను, జాగర్త! వాడెవడో అల్లాయి పుల్లాయి ఆవకాయి, బీరకాయి అనుకున్నావా? కె. యస్. సుందర్రావు ఈజ్ నన్ బట్ మై నెవ్యూ, ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్యి" నా కాగితం ముక్కలకింద చింపి నామీద అక్షింతలు వేశారు మా కమీషనర్‌గారు.

"సారీ సార్!" అన్నాను, ఉద్యోగ ధర్మంగా.

"రేపట్నుంచి వార్డ్ నెంబర్ త్రీలో పనిచెయ్యి. సాయంకాలం ఆర్డరిస్తాను" అన్నారు దొరగారు.

'మేనత్తగా పుట్టడం కంటె మేనల్లుడుగా పుట్టడం మంచిది' అనుకుంటూ ఇవతల పడ్డాను.

(28-7-79)